# దేశంలోనే ఎక్కడ లేని విధంగా తెలంగాణ ప్రభుత్వం చేసిన
# కుల సర్వేను అభినందించిన బీసీ సంఘాలు



**బీసీ సంఘాలు, బీసీ మేధావులతో మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ సలహాదారు కే.కేశవరావు సమావేశం**

**బీసీ సంఘాలను అనుమానాలను నివృత్తి చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్**

**వారి సూచనలు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకుపోతాం - మంత్రి పొన్నం ప్రభాకర్**

కరీంనగర్, జనవరి 08 (వాయిస్ టుడే): దేశంలో ఎక్కడ లేని విధంగా తెలంగాణ సమగ్ర ఇంటింటి కుటుంబ కుల సర్వే సమాచారం రాష్ట్రంలో ఉందని బీసీ సంఘాలు, బీసీ మేధావులు తెలంగాణ ప్రభుత్వాన్ని అభినందించారు. సచివాలయంలోని రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కార్యాలయంలో ప్రభుత్వ సలహాదారు కే. కేశవరావు, మంత్రి పొన్నం ప్రభాకర్ బీసీ సంఘాల నేతలు , మేధావులు , ప్రొఫెసర్ లతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. సమావేశంలో వారికి ఉన్న అనుమానాలను నివృత్తి చేశారు.గత సంవత్సరం ఫిబ్రవరి 2024 నా క్యాబినెట్ నిర్ణయం తీసుకుందని అదే నెల 16వ తేదీన శాసనసభలో బీసీ కులగనుల పైన తీర్మానం చేసుకున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. తర్వాత పార్లమెంటు ఎన్నికల వల్ల కొంత ఆలస్యమైనట్టు వెల్లడించారు. ప్రభుత్వం బీసీ కమిషన్ చైర్మన్ సభ్యులను నియమించిందని తెలిపారు. బీసీ కమిషన్ దగ్గర ఇన్ఫ్రాస్ట్రక్చర్ లేకపోవడంతో ప్లానింగ్ డిపార్ట్మెంట్ కి సమగ్ర సర్వేను అప్పగించింది. 150 ఇళ్ళను ఒక గ్రూపింగ్ చేసి పదిమంది ఎన్యూమరేటర్లకు ఒక పరిశీలకుడు లక్ష మంది ప్రభుత్వ ఉద్యోగులు ఈ సర్వే నిర్వహించాలని రాష్ట్రస్థాయిలో సందీప్ కుమార్ సుల్తానియ , హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురశెట్టి దీనిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించారని తెలిపారు. సర్వే కోసం 160 కోట్ల ప్రభుత్వం కేటాయించిందని గ్రామాల్లో సర్వే బాగా జరిగిందని హైదరాబాద్ లాంటి నగరాల్లో కొంత ఇబ్బంది ఏర్పడిందని సమావేశంలో చర్చించారు. రాహుల్ గాంధీ ఆదేశాల కనబడడం గా తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కుల గణన పూర్తి చేసింది.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో దేశంలో అత్యంత పారదర్శకంగా రాజకీయ, సామాజికంగా, విద్యాపరంగా, ఆర్థికంగా మేం ఎంతో మాకు అంత నినాదాన్ని నిజం చేయడానికి ఇంటింటి సమగ్ర కుల సర్వే నిర్వహించడం జరిగింది. దీనిని కొన్ని ప్రతిపక్ష పార్టీలు అభ్యంతరాలు లేవనెత్తి గోరంతను కొండంత చేస్తూ కుల సర్వేను తప్పుపడుతున్న తరుణంలో బీసీ సంఘాలు , మేధావులు , ప్రొఫెసర్ల తో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. బీసీ కుల గణన ద్వారా సామాజిక న్యాయం జరుగుతుందని సమాజంలో అట్టడుగు వర్గాలకు న్యాయం చేయడానికి ఎవరు ఎలాంటి సలహాలు సూచనలు ఇచ్చిన స్వీకరిస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. రాహుల్ గాంధీ ఆదేశాలకు అనుగుణంగా తెలంగాణ రాష్ట్రంలో కుల గణన ద్వారా సామాజిక న్యాయం చేకూరుస్తూ దేశంలోనే మొదటిసారిగా కుల సర్వేను పారదర్శకంగా నిర్వహించిందని తెలిపారు.పలు బీసీ సంఘాలు నేతలు ఇచ్చిన సూచనలు స్థానిక సంస్థల ఎన్నికలు తదితర రాజకీయ రిజర్వేషన్లు, బీసీ ఎంపవర్మెంట్, బీసీ డిక్లరేషన్ అమలు వారి సలహాలు సూచనలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికీ తీసుకెళ్లి అమలయ్యేలా చూస్తామని బీసీ ల సామాజిక న్యాయం జరగడానికి తమ ప్రభుత్వం పార్టీ కట్టుబడి ఉంటుందని బీసీ సంఘాలతో మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. తమ ప్రభుత్వం ఓపెన్ గా సలహాలు సూచనలు స్వీకరిస్తుందని ఇందులో ఎలాంటి దాపరికాలు, విమర్శలు లేవన్నారు. రాజకీయ లబ్ధి కొరకు కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ,10 సంవత్సరాలుగా రాష్ట్రంలో అధికారంలో ఉన్న బిఆర్ఎస్ లు బీసీ లను అణగదొక్కి సామాజిక న్యాయం చేయకుండా వారు ఉన్నప్పుడు కుల గణన చేయలేదు. పారదర్శకంగా పని చేస్తున్న తమ ప్రభుత్వం పై విమర్శలుచేస్తున్నారన్నారు. ఈ సమావేశంలో ఎంపి సురేష్ షెట్కర్ , ఎమ్మెల్యే వీర్ల పల్లి శంకర్ , కాంగ్రెస్ సీనియర్ నేత మధుయాష్కి,మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్,బీసీ కమీషన్ చైర్మన్ నిరంజన్, బీసీ కమిషన్ సభ్యులు రాపోలు జయప్రకాశ్ ,తిరుమలగిరి సురేందర్ ,బాలలక్ష్మి, కార్పొరేషన్ చైర్మన్ లు నూతి శ్రీకాంత్ గౌడ్ , జ్ఞానేశ్వర్,ఈరవత్రి అనిల్, మెట్టు సాయి కుమార్, జైపాల్, వినయ్ కుమార్,బీసీ సంఘాల నేతలు ఆర్ కృష్ణయ్య , జాజుల శ్రీనివాస్ గౌడ్, మాజీ బీసీ కమిషన్ చైర్మన్ వకులాభరణం కృష్ణమూర్తి, మాజీ ఐఏఎస్ చిరంజీవులు మురళి మనోహర్, తాడురీ శ్రీనివాస్ ,బాలరాజు గౌడ్, దాసు సురేష్ శ్రీనివాస్ పలువురు బీసీ సంఘం నేతలు, ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

# కమిషనర్ తీరుపై కార్మికుల ఆగ్రహం



పాలమూరు నగరపాలకం: పాలమూరు నగరపాలక సంస్థ కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి తీరును నిరసిస్తూ పారిశుద్ధ్యం, ప్రణాళిక, రెవెన్యూ విభాగాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు, కార్మికులు సీఐటీయూ ఆధ్వర్యంలో శనివారం ఆయన ఛాంబర్ ఎదుట ధర్నా చేపట్టారు. కమిషనర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ఆయనపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మొదట నగరపాలక సంస్థ కార్యాలయ ఆవరణలోని కార్మిక సంఘం భవనంలో సమావేశమైన కార్మికులు అక్కడి నుంచి ర్యాలీగా కమిషనర్ ఛాంబర్ వద్దకు చేరుకున్నారు. సీఐటీయూ నేతలు సుధాకర్, గోపాల్, కురుమూర్తి, నగరపాలక సంస్థ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శి ఆకుల వెంకటేశ్, ఎర్ర నర్సింహ మాట్లాడుతూ కమిషనర్ హోదాలో ఉండి సిబ్బందిని పరుష పదజాలంతో దూషించటం, అవమానకరంగా వ్యవహరించటం సరికాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కమిషనర్ ఏడాది కాలంగా కార్మికులను తీవ్ర వేధింపులకు గురిచేస్తున్నాడని వాపోయారు. పారిశుద్ధ్య విభాగం జవాన్లు, కార్మికులు, రెవెన్యూ, ప్రణాళిక విభాగాల్లో పనిచేసే బిల్ కలెక్టర్లు, వార్డు అధికారులు,. ఫీల్డ్ సిబ్బందిని కమిషనర్ అభ్యంతరక భాషను ఉపయోగిస్తూ తిడుతుంటారని, ప్రశ్నిస్తే చేయెత్తి దాడి చేసేందుకు వస్తున్నారని ఆరోపించారు. కింది స్థాయి ఉద్యోగులు, కార్మికులపై చిన్న చూపు తగదని, జిల్లా కలెక్టర్ స్పందించి కమిషనర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. చర్యలు తీసుకోకపోతే సమ్మె చేపట్టడానికి కూడా వెనుకాడబోమని హెచ్చరించారు. అనంతరం మేనేజర్ వెంకటేశ్వర్‌రావుకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో కార్మిక నాయకులు చంద్రకాంత్, రాజ్‌కుమార్, వర్ద గాలెన్న, ప్రభాకర్, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

# కృష్ణమ్మ కలిపింది ఇద్దరినీ..!

మేళ్లచెరువు : 'నేనీదరినీ.. నువ్వాదరినీ.. కృష్ణమ్మ కలిపింది ఇద్దరినీ' అంటూ కృష్ణానది తీరంలో ఓ ప్రేమ జంట కలుసుకున్న సందర్భాన్ని సినీ కవి ఏనాడో పాట రూపంలో వర్ణించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రెండు రాష్ట్రాలుగా వీడినప్పటికీ.. నేటికీ ఆ బంధాలు బలంగానే కొనసాగుతున్నాయి. ఉమ్మడి నల్గొండ జిల్లాలో దాదాపు 115 కి.మీ.దూరం కృష్ణానది ప్రవహిస్తుండగా.. నదీ తీరం ఇరువైపులా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలున్నాయి. ఈ రెండు రాష్ట్రాల ప్రజలు కృష్ణానదిని వారధిగా చేసుకుని నిత్యం కలుస్తుంటారు. మట్టపల్లి, చింత్రియాల, బుగ్గమాధారం వంటి నదీ తీరంలోని చాలా ప్రాంతా ల్లో నది దాటేందుకు ఒకప్పుడు నాటు పడవలు వాడేవారు. ఇప్పుడు బల్లకట్టులు నడుపుతున్నారు. ప్రస్తుతం చింత్రియాల, బుగ్గమాధారం రేవుల వద్దనే వీటిని నడిపిస్తున్నారు. గడిచిన దశాబ్ద కాలంలోనే మట్టపల్లి వద్ద నదిపై వంతెన, వజినేపల్లి వద్ద పులిచింతల ప్రాజెక్టు నిర్మించారు. ఈ వంతెనల పైనుంచి నిత్యం వేలల్లోనే ఇరు ప్రాంతాల ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. తమ బంధాలను పదిల పరుచుకుంటున్నారు. కొన్నేళ్ల కిందట పల్నాడు కరవు ప్రాంతం. అక్కడ్నుంచి వందల కుటుంబాలు ఉపాధి కోసం వలస వచ్చాయి. ఇక్కడే స్థిరపడ్డాయి. నదికి ఇరువైపులా రక్త సంబంధాలతోనే కుటుంబాలు పెద్దగా విస్తరించాయి. ఇదే వైవాహిక బంధాలకు తేలికైన మార్గమైంది. వ్యవసాయంలోనూ పరస్పర సహకారం ఉంటుంది. ఒకరింట్లో వ్యవసాయ పనులప్పుడు మరో మనిషి



అవసరమనిపిస్తే తప్పకుండా వచ్చేస్తారు. పనులు పూర్తయిన తర్వాతే మళ్లీ వారి సొంతింటికి ప్రయాణమవుతారు.

ఇరు ప్రాంత ప్రజల వ్యాపార కార్యకలాపాలకూ మార్గం సుగమమైంది. వందల మంది రకరకాల వ్యాపార సంస్థలను స్థాపించారు. వాణిజ్య కేంద్రాలను నెలకొల్పుతున్నారు.

పల్నాడు, ఎన్టీఆర్ జిల్లాల్లో రంగస్థల నాటక కళాకారులు ఎక్కువ. ఇరు ప్రాంతాల్లో జరిగే జాతర్లలో ప్రదర్శనలిస్తుంటారు. ఇప్పుడు వీరితో పాటు సినీ నృత్య కళాకారులూ ఇక్కడ జాతర్లకు వస్తుంటారు. అక్కడి వారిలాగే ఇక్కడి వారితోనే వారికి పరిచయాలు ఏర్పడ్డాయి. ఒకప్పుడు తెలంగాణలో మంచి విద్యాసంస్థలు లేవనే ప్రచారం ఉండేది. దీంతో ఇక్కడి తల్లిదండ్రులు తమ పిల్లలను గుంటూరు, నరసరావుపేట, సత్తెనపల్లి, విజయవాడ ప్రాంతాల్లోని విద్యాసంస్థల్లో తమ పిల్లల్ని చేర్పించేవారు. రాష్ట్రం అవతరించిన తర్వాత కూడా అక్కడే చదివిస్తున్న వారున్నారు.

దాదాపు రూ.50 లక్షలతో నిర్మించిన బల్లకట్టునే ఇప్పుడు కృష్ణానదిపై ప్రయాణించేందుకు వాడుతున్నారు. ఒక్కసారి వంద మందిని కూడా ఆవలి ఒడ్డుకు చేర్చుతుంది. ప్రయాణ కాలం కేవలం పది నిమిషాలు మాత్రమే. పిడుగురాళ్ల, సత్తెనపల్లి, దాచేపల్లి, గురజాల, మాచర్ల వంటి ప్రాంతాలకు వెళ్లేవారు నదిపై ప్రయాణాన్నే ఎంచుకుంటారు.

వలస వచ్చిన వారు వివిధ వ్యాపార సంస్థలు నడపడమే కాకుండా రాజకీయాల్లోనూ అడుగు పెట్టారు. ఇరవై ఏళ్ల కిందటే ప్రజాప్రతినిధులుగా ఎన్నికయ్యారు. కృష్ణానది తీర ప్రాంతాల్లో నేటికీ పదుల సంఖ్యలో ఈ ప్రాంతంలో పెద్ద మనుషులుగా చలామణి అవుతున్నారు.

## టీఎస్ జేయు రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీగా నాగపూరి నాగరాజు నియామకం



వరంగల్ ( వాయిస్ టుడే ) ఫిబ్రవరి 08: తెలంగాణ రాష్ట్రజర్నలిస్ట్ యూనియన్ (టి.ఎస్. జే.యూ) రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీగా వరంగల్ కి చెందిన రిపోర్టర్ నాగపురి నాగరాజు(వి6)ను నియమిస్తూ టి.ఎస్. జే.యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోకల అనిల్ కుమార్ బుధవారం ఉత్త ర్వులు జారీ చేశారు. జర్నలిజానికి వృత్తి విలువలు,సూత్రాలను నిలబెట్టడంలో అచంచలమైన నిబద్ధతకు గుర్తింపుగా ఈ పదవి బాధ్యతులు అప్పగిస్తున్నట్లు వారు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ సందర్భంగా నాగపూరి నాగరాజు మాట్లాడుతూ తనపై నమ్మకం తో రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీగా బాధ్యతలు అప్పగించినందుకు టి ఎస్ జె యు రాష్ట్ర అధ్యక్షులు నారగాని పురుషోత్తం,రాష్ట్ర ప్రధానకార్యదర్శి తోకల అనిల్ కుమార్ లకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే తన నియామకానికి సహకరించి న వరంగల్ జిల్లా అధ్యక్షులు కందికొండ.మోహన్,జిల్లా ప్రధాన కార్య దర్శి అవునూరి కుమారస్వామి,కార్యవర్గ సభ్యులందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తూ జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి అహర్నిశలు కృషి చేస్తానని, తెలంగాణలోని జర్నలిస్టులందరికీ మద్దతు ఇచ్చే టీ.ఎస్.జే.యు సంఘాన్ని పెంపొందించడం లో కీలక పాత్ర పోషిస్తానని ఈ సందర్భంగా నాగపూరి నాగరాజు పేర్కొన్నారు.

## వికసిత్ భారత్ కు జై కొట్టిన ఢిల్లీ ప్రజలు

**అప్ పార్టీని చీపురుతో సహా ఉద్వేసిన ఢిల్లీ ఓటర్లు.**

**తెలంగాణ, కర్ణాటక కాంగ్రెస్ పాలనను చూసి చీకొట్టిన ఢిల్లీ మేధావులు**

**బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్**



వరంగల్ ( వాయిస్ టుడే ) ఫిబ్రవరి 08 : ఢిల్లీ ఫలితలలో బీజేపీ పార్టీ అత్యధిక స్థానాలలో ముందజలో వుండి ఢిల్లీ పీఠం కైవసం చేసుకొన్న సందర్భంగా వరంగల్ తూర్పు జిల్లా బిజెపి శ్రేణులు వరంగల్ చౌరస్తా లో స్థానిక ప్రజలకు మిఠాయిలు పంచుతూ, బాణాసంచా కాల్చి సంబరాలు చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ దాదాపు 27ఏళ్ళ తర్వాత ఢిల్లీ ప్రజలు బీజేపీ కీ పట్టం కట్టారని, ఢిల్లీ ప్రజలు చీపిరితో ఆమ్ ఆద్మీ పార్టీని ఊడ్చేశారని వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ అన్నారు.ఢిల్లీ అయినా గల్లీ అయిన బీజేపీ తోనే ప్రజలంతా.. నరేంద్ర మోడీ తోనే మేమంతా అని చాటి చెప్పిన ఢిల్లీ ప్రజల కు అయన కృతజ్ఞతలు చెపుతూ ప్రజాస్వామ్య బద్ధమైన పాలన డిల్లీ ప్రజలు కోరుకున్నారని, అవినీతి,కుంభకోణాలు, జైలు పార్టీలు మాకు వద్దని ఢిల్లీ ఓటర్లు భావించారన్నారనీ,డిల్లీలో కాషాయ జెండా ఎగురుతుందని ముందు నుంచి ఊహించిందేనని, మేధావి వర్గం అంతా బీజేపీకి ఓటు వేశారని తెలిపారు. రానున్న రోజుల్లో తెలంగాణలో కూడా అధికారంలోకి వస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో జరుగుతున్న మూడు ఎమ్మెల్సీ స్థానాల్లో విజయం సాధిస్తుందని వెల్లడించారు. రాష్ట్రంలోని మేధావి వర్గం, ఉద్యోగ ఉపాధ్యాయులు ఆలోచించి ఓటు వేయాలని కోరారు. శాసనసభలో మీ సమస్యల గురించి ప్రశ్నించేది బీజేపీ ఒక్కటే అని గంట రవికుమార్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున బిజెపి నాయకులు, కార్యకర్తలు,మహిళలు, అభిమానులు పాల్గొన్నారు.



## క్రీడలు మంచి మానసిక ఆరోగ్యాన్ని ఉల్లాసాన్ని కలిగిస్తాయి

**నెహ్రూ యూవ కేంద్రం డిప్యూటీ డైరెక్టర్ : చింతల అన్వేష్**

**క్రీడలను రాణించిన వ్యక్తుల్ని స్ఫూర్తిదాయకంగా తీసుకోవాలి.**

**-వరంగల్ ట్రాఫిక్ సీఐ రామకృష్ణ**

వరంగల్ ఓ సిటీ మైదానంలో నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో జిల్లా స్థాయి యువజన క్రీడోత్సవాలు శనివారం నాడు ముగియాగా ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నెహ్రూ యువ కేంద్రం డిప్యూటీ డైరెక్టర్ చింతల అన్వేష్, వరంగల్ ట్రాఫిక్ సిఐ రామకృష్ణ లు హాజరై యువజన క్రీడ ఉత్సవాల్లో భాగంగా గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులను అందజేయడం జరిగింది వాలీబాల్ పురుషుల విభాగంలో గీసుకొండ జట్టు కు మొదటి బహుమతి ప్రధానం చేశారు . అదేవిధంగా కబడ్డీ మహిళా విభాగంలో మొదటి బహుమతి నర్సంపేట కు రాగా రెండో బహుమతి గీసుకొండ రావడం జరిగింది. రన్నింగ్ మరియు షటిల్ సింగిల్ నర్సంపేట జట్టు కు రావడం జరిగింది. అనంతరం యువతను ఉద్దేశించి ముఖ్య అతిథులు మాట్లాడుతూ యువత క్రీడల్లో రాణించాలని మానసిక ఉల్లాసానికి క్రీడలో ఎంతగానో ఉపయోగపడతాయని యువత గంజాయి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని క్రీడల్లో రాణించిన వ్యక్తులను స్ఫూర్తిదాయకంగా తీసుకొని భవిష్యత్తులో గొప్ప స్థాయికి వెళ్లాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ యువజన అవార్డు గ్రహీత జక్కి శ్రీకాంత్, పి ఈ టి లు జలగం రఘువీర్, శ్రీనివాస్, భాష సమ్మయ్య, సుభద్రా సురేష్, భిక్షపతి రాజు తదితరులు పాల్గొన్నారు